
వెలగని దీపం.. ఆలయ గోపురంపై అంధకారం



కాళేశ్వరం దేవస్థానం తూర్పు రాజగోపురం పైభాగంలో అమర్చిన విద్యుత్తు దీపం వెలగడంతో గతంలో గోపురం కాంతులతో మెరిసిపోయేది. గోదావరికి అవతలి తీరం గ్రామాలకు వెలుగులు కనిపించేవి. దీపం మరమ్మతుకు గురి కావడంతో కొంత కాలంగా రాజగోపురం పై నుంచి కింది భాగం వరకు చీకటి అలముకుంటోంది. అధికారులు కొత్తదీపం ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కాళేశ్వరం

27న పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల జ్ఞాపకార్థం ఈ నెల 27న పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ కిరణ్‌ఖరే ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో ఆన్‌లైన్‌లో పోటీలు ఉంటాయన్నారు. కానిస్టేబుళ్లు, ఏఎస్సైలకు 'సమాజంలో పోలీసు ప్రతిష్ఠను మెరుగుపర్చడంలో నా పాత్ర' అనే అంశంపై, ఎస్సై నుంచి ఆపై అధికారులకు 'సౌండ్ మైండ్ ఇన్ ఏ సౌండ్ బాడీ, దృఢమైన శరీరంలో దృఢమైన మనస్సు' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేస్తారన్నారు.

వసతులు అరకొర.. చలికి గజగజ

జిల్లాలోని పలు సంక్షేమ వసతిగృహాలు సమస్యల నిలయాలుగా మారాయి. అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చలికాలం ప్రారంభమైన నేపథ్యంలో.. కొన్ని చోట్ల చలి నుంచి రక్షణ లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పలు వసతిగృహాల్లో కప్పుకునేందుకు దుప్పట్లు, పడుకునేందుకు మంచాలు లేవు. దర్వాజలకు, కిటికీలకు తలుపులు లేవు. దీంతో విద్యార్థులు చలికి వణికిపోతున్నారు. దోమల బెడదతో కునుకు కరవై ఇబ్బందులు పడుతున్నారు. రాబోయే రోజుల్లో చలితీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లాలోని పలు ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాల్లో బుధవారం 'న్యూస్‌టుడే' పరిశీలన చేపట్టింది. పరిశీలనలో గుర్తించిన సమస్యలివి..

–టేకుమట్ల, న్యూస్‌టుడే

పరిశీలన

దోమల బెడద



చిట్యాలలోని బీసీ బాలుర వసతిగృహంలో కిటికీకి ఉన్న తలుపు ఇటీవల ఊడిపోయింది. దీంతో విద్యార్థులు గన్నీ సంచిని కిటికీకి అడ్డుగా పెట్టుకొని చలి నుంచి రక్షణ పొందుతున్నారు. అయినప్పటికీ దోమల బెడద ఎక్కువగా ఉంటుందని పిల్లలు చెబుతున్నారు. గతేడాది వసతి గృహం చుట్టూ ప్రహరీ కూలింది. ఇప్పటి వరకు నిర్మించలేదు.

దుప్పట్లే తలుపులుగా..



మహాముత్తారంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో మూడు కిటికీలకు తలుపులు లేవు. దీంతో దోమలు, చలిగాలి నుంచి రక్షణ పొందేందుకు విద్యార్థులు కిటికీలకు అడ్డంగా దుప్పట్లను అమర్చుకున్నారు. మంచాలు ఉన్నప్పటికీ పరుపులు లేవు. రెండు గాలి పంకాలు మరమ్మతులకు గురికావడంతో విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు.



నేలపైనే నిద్ర

మహాముత్తారం మండల కేంద్రంలో అద్దెభవనంలో నిర్వహిస్తున్న బీసీ బాలుర వసతిగృహంలో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. ఓ గదిలో కిటికీకి మెష్ ఏర్పాటు చేయలేదు. దీంతో దోమల బెడదతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గదులు ఇరుకుగా ఉండడంతో విద్యార్థులు నిద్రించేందుకు వచ్చిన మంచాలు వెనక్కి వెళ్లాయి. దీంతో పిల్లలు నేలపైనే నిద్రిస్తున్నారు.



సంచులతో రక్షణ

మహదేవపూర్‌లోని గిరిజన బాలుర వసతిగృహంలోని పలుగదుల్లో కిటికీలు దెబ్బతినడంతో తలుపులు లేవు. దీంతో విద్యార్థులు కిటికీలకు సంచులు, ప్లాస్టిక్ కవర్లను అడ్డుగా పెట్టుకొని దోమలు, చలిగాలి నుంచి రక్షణ పొందుతున్నారు. వసతిగృహంలో ఏర్పాటు చేసిన సౌరశక్తి వాటర్ హీటర్ పనిచేయకపోవడంతో చన్నీళ్లతోనే స్నానం చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

అద్దె భవనంలో సౌకర్యాలు కరవు



భూపాలపల్లి కారల్‌మార్క్స్ కాలనీలోని ప్రభుత్వ గురుకుల విద్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. 5 నుంచి 8వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో 80 మంది విద్యార్థులకు గాను 52 మంది హాజరయ్యారు. పిల్లలు నిద్రించేందుకు మూడు గదులను కేటాయించారు. ఈ గదుల్లో కిటికీలకు తలుపులు లేకపోవడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు ఐదేళ్ల నుంచి దుప్పట్లు, పెట్టెలు, పళ్లేలను పంపిణీ చేయడం లేదు.

దాతలూ.. స్పందించండి!

చలికాలం సమీపిస్తోంది. ప్రభుత్వ వసతిగృహాల్లో పేద విద్యార్థులు సరైన సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. చాలా వసతి గృహాల్లో పిల్లలకు దుప్పట్లు ఇంకా అందలేదు. కిటికీలకు తలుపులు లేక, దోమలు రాకుండా జాలీలు లేక సతమతమవుతున్నారు. చలిలో వణుకుతూ దోమలతో యుద్ధం చేస్తూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఈనేపథ్యంలో వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి దాతలు, స్పందించి సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉంది. స్థానికులు, ప్రజా ప్రతినిధులు కూడా చేయూత అందిస్తే మేలు.

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోళ్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత కేంద్రాల ఇన్‌ఛార్జిలు అవగాహనతో ఉండాలన్నారు. కొనుగోళ్ల కోసం నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యం నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు ట్యాగింగ్ చేసి మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, పౌరసరఫరాలశాఖ అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల డీఎం రాములు, మార్కెటింగ్ అధికారి కనకశేఖర్, డీఆర్డీవో అవినాశ్, డీఏవో విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమర్థంగా పని చేయాలి: భూపాలపల్లి: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమర్థంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. ఆయన భూపాలపల్లి హన్‌మాన్‌నగర్-2లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారం, పిల్లల హాజరు వివరాలు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు.. మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచారాన్ని సేకరించాలి: భూపాలపల్లి కలెక్టరేట్: ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా అన్ని వర్గాల ప్రజల సమగ్ర సమాచారాన్ని సేకరించాలని బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ అన్నారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో మాట్లాడారు. అన్ని కులాల ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలపై నవంబర్ 2న హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనేలా ప్రజాప్రతినిధులు, మేధావులు, వివిధ కుల సంఘాల నాయకులకు సమాచారం అందించాలన్నారు. డిసెంబర్ 19వ తేదీ వరకు సర్వే చేయాలన్నారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, బీసీ సంక్షేమాధికారి శైలజ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. సమయపాలన పాటించని వైద్యాధికారి నిహారిక, స్టాఫ్ నర్సు సంధ్యారాణి, ఫార్మసిస్ట్ చైతన్య, సహాయ సిబ్బందికి, ఓపీ ఏఎన్ఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. భూపాలపల్లిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌లో 172 సీట్లను భర్తీ చేసేందుకు ప్రవేశాలు జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. యువతకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం నూతనంగా 6 కోర్సులను ప్రవేశపెట్టిందన్నారు. పదో తరగతి ఆపై విద్యార్హతలు ఉన్నవారు అర్హులన్నారు. ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఐటీఐ ప్రిన్సిపల్ జుమ్లా నాయక్, డీఆర్డీవో అవినాశ్ పాల్గొన్నారు.

'వ్యాధులపై అప్రమత్తత అవసరం'



వివరాలు తెలుసుకుంటున్న సీఈవో విజయలక్ష్మి


టేకుమట్ల, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని జడ్పీ సీఈవో విజయలక్ష్మి అన్నారు. ఆమె బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న టీకాలు, ఇటీవల టేకుమట్లలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాలని, రైతులకు పండ్ల మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో అనిత, ఎంపీవో సురేశ్, ఏపీవో మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

కాటారం, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఓంటేరు చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన ఎస్ఏ-1 పరీక్షలను ఆయన పరిశీలించారు. జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి నవంబర్ 16న తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని, విద్యార్థుల ప్రగతిపై చర్చించి ప్రగతి కార్డులు అందజేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీదేవి, డీసీఈబీ సహాయ కార్యదర్శి ఎస్. భద్రయ్య, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుదర్శన్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

క్రమశిక్షణ.. లాఠీ తప్పుతోంది!

తాజాగా ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవికుమార్‌పై కాజీపేట ఠాణాలో పోక్సో కేసు నమోదు కావడం సంచలనం సృష్టించింది.



స్నేహపూర్వక పోలీస్ వ్యవస్థ అని చెబుతూ కొందరు పోలీసులు గాడి తప్పి వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన చోట కొంతమంది హద్దులు మీరి ప్రవర్తిస్తున్నారు. వీరితో మొత్తం పోలీసు శాఖకు చెడ్డ పేరు వస్తోంది. అవినీతి, అక్రమ వసూళ్లు నుంచి మహిళలు, చిన్నారులపై అత్యాచారాల వరకు అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ఠాణాల్లో పోలీసు అధికారులపైనే కేసులు నమోదు కావడం చర్చనీయాంశమైంది.

– న్యూస్‌టుడే, వరంగల్‌క్రైం

ఫిర్యాదు చేసేందుకు భయం

పోలీసుశాఖలో వరుస ఘటనలు వెలుగు చూస్తుండడంతో సామాన్యులు ఠాణాలకు వచ్చి ఫిర్యాదులు చేసేందుకు భయపడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

అక్రమ కేసులు, ఇతర వ్యవహారాల్లో జోక్యం చేసుకున్న పోలీసు అధికారులపై తాత్కాలికంగా చర్యలు తీసుకుంటున్నా కొద్ది రోజుల తర్వాత రాజకీయ నాయకుల అండదండలతో బయటకు వస్తున్నారు. వారి సిఫార్సు లేఖలతో కీలకమైన విభాగాల్లో పోస్టింగ్‌లు పొందుతున్నారు. తర్వాత కేసు విచారణ సమయంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆరోపణలను రద్దు చేయించుకుంటున్నారు.

రాజకీయ జోక్యం తగ్గాలి

పోలీసు శాఖ పోస్టింగ్‌ల్లో రాజకీయ జోక్యం తగ్గితే చాలా వరకు మార్పులు వస్తాయి. ప్రతిభ ఆధారంగా పోస్టింగ్‌లు ఇస్తే కొంత వరకు ప్రజలకు మేలు జరుగుతుంది.

ఈ ఏడాది వరుస ఘటనలు..

- కేయూ ఠాణాలో పనిచేసిన ఎస్సై అనిల్ మరో ప్రభుత్వశాఖలో పనిచేస్తున్న ఉద్యోగిని వేధించాడు. మహిళ భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.
- జయశంకర్‌భూపాల్‌పల్లి జిల్లాలో పనిచేస్తున్న సీఐ సంపత్ కేయూ ఠాణా పరిధిలో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమె కూతురుపైనా అత్యాచారం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.
- పోలీసు శాఖలోని ఇతర విభాగంలో పనిచేస్తున్న సీఐ చింతగట్టు సమీపంలో అతిథి గృహంలో మహిళతో ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లేసరికి మహిళను తప్పించాడు. అనంతరం పోలీసులు దీనిపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు.
- గత ఏడాది పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్, మహిళ ఎస్సైతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. భర్త ఫిర్యాదు మేరకు విచారణ చేసిన అధికారులు ఇన్‌స్పెక్టర్, ఎస్సై ఇద్దరిని సస్పెండ్ చేశారు.

ఏటీసీ స్థలానికి హద్దుల ఏర్పాటు



జేసీబీని అడ్డుకుంటున్న మహిళలు

కాటారం, న్యూస్‌టుడే: కాటారంలోని తిమ్మనకుంటలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ) ఏర్పాటుకు కేటాయించిన స్థలానికి బుధవారం పోలీసులు హద్దులు ఏర్పాటు చేశారు. ఇందుకోసం జేసీబీతో కందకం తవ్వించారు. గంగారం, కాటారంలో స్థలం కేటాయించినా స్థలాభావంతో నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఏటీసీ నిర్మాణంలో జాప్యంతో ప్రవేశాల ప్రక్రియ ఆలస్యమవుతోందని 'ఆధునిక శిక్షణ.. అందని ద్రాక్షేనా' శీర్షికతో బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పది రోజుల్లో పనులను ప్రారంభించనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

ఈనాడు కథనానికి స్పందన

పనులను అడ్డుకున్న స్థానికులు

ఏటీసీ నిర్మాణ స్థలంలో తమ ఇళ్ల స్థలాలు ఉన్నాయంటూ స్థానికులు జేసీబీని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. జేసీబీపైకి ఎక్కి ఆందోళన చేపట్టారు. తమ భూములకు హద్దులను గుర్తించకుండానే పనులు చేయడం సరికాదని, న్యాయం చేయాలని కోరారు. కాటారం, మల్హర్ ఎస్సైలు అభినవ్, నరేశ్‌ల ఆధ్వర్యంలో పోలీసు చేరుకొని ఆందోళనకారులను ఠాణాకు తరలించారు. ఏవైనా సమస్యలు ఉంటే తహసీల్దార్ కార్యాయంలో ఫిర్యాదు చేయాలని, సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

తెరమరుగు!

● ఉమ్మడి జిల్లాలో గత ఐదేళ్లలో 15 థియేటర్ల మూత


ఒక థియేటర్ నడవడం వల్ల నగరంలో 10 మంది, గ్రామీణ ప్రాంతాల్లో అయిదుగురు ఉపాధి పొందుతారు.

జిల్లాల వారీగా వివరాలు

	ప్రస్తుతం నడుస్తున్న థియేటర్లు	మూతబడినవి
త్రినగరి పరిధి	10	12
ములుగు	03	02
జయశంకర్	03	01

● ప్రస్తుతం నడుస్తున్న థియేటర్లు ● మూతబడినవి

ఒకప్పుడు సినిమా విడుదల ఉందంటే థియేటర్ల వద్ద పండగ వాతావరణం ఉండేది. ప్రధానంగా దసరా, దీపావళి, సంక్రాంతి పండగల వేళ కొత్త సినిమాలతో నెలకొనే కోలాహలం అంతా ఇంతా కాదు. ఇంటిల్లిపాది సినిమా చూస్తేనే పండగకు నిండుదనం వచ్చేది. కానీ! కరోనా తర్వాత సంక్షోభంలోకి వెళ్లిన వెండితెర పూర్తిస్థాయిలో కోలుకోలేదు. వరంగల్, హనుమకొండ, కాజీపేట త్రినగరిలోనే కాదు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సినిమా థియేటర్లు క్రమంగా మూతబడుతున్నాయి. గత ఐదేళ్లలో 15 థియేటర్లు మూసేశారు.



వరంగల్ నగరంలోని రామ్‌లక్ష్మణ్ టాకీస్ ఇది. పెద్ద హీరోల సినిమాలు విడుదలైనప్పుడు తెరిచి ఆ తర్వాత మూసివేస్తున్నారు



మట్టెవాడలో మూతబడిన కాకతీయ కాంప్లెక్సు

ఫంక్షన్ హాల్స్, షాపింగ్ మాల్స్‌గా..



వరంగల్ స్టేషన్‌రోడ్డులో థియేటర్ తొలగించి వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్న యాజమాన్యం

కొన్ని టాకీస్‌లు వేదుకల మందిరంగా మారుతుండగా.. మరికొన్ని వాణిజ్య సముదాయాలుగా రూపాంతరం చెందుతున్నాయి. ప్రేక్షకులు ఇంట్లో రంగురంగుల టీవీల్లో, చరవాణుల్లో ఓటీటీల ద్వారా సినిమాలు చూస్తున్నారు. దీంతో సినిమా టాకీస్‌లపై ఆధారపడ్డ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. అమ్మలా ఆదరించిన సినీ కళామతల్లికి ఇంతటి కష్టమొస్తుందని అనుకోలేదని థియేటర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ నగరంలో సినిమా థియేటర్ల మూసివేత, కూల్చివేతలు గత మూడేళ్లలో ఎక్కువయ్యాయి.

– న్యూస్‌టుడే, కాశీబుగ్గ, రంగశాయిపేట


10 శాతం మందే ఆధారపడుతున్నారు

- రమేశ్ తెలంగాణ ఎగ్జిబ్యూటర్ అసోసియేషన్ ఈసీ సభ్యుడు, వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి



రోజురోజుకు భూముల విలువ పెరుగుతుండటంతో థియేటర్లు తొలగించి.. ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో 10 శాతం యజమానులు మాత్రమే సినిమాలపై ఆధారపడుతున్నారు. థియేటర్ల పరిస్థితి బాగాలేదు. లాభాలు లేవు. ఇప్పుడు 90 శాతం మంది లీజుకు తీసుకొని నిర్వహిస్తున్నారు. లాభాలు లేక వారి పరిస్థితీ దయనీయంగా ఉంది. సింగిల్ థియేటర్ల మనుగడ కొనసాగాలంటే కనీసం విద్యుత్తు బిల్లులపై ప్రభుత్వం రాయితీ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

40 ఏళ్లుగా పనిచేస్తున్నా..: - మహ్మద్ దస్తగిరి, సినీ కార్మికుడు



వరంగల్ అజంజాహి మిల్లు సమీపంలో 40ఏళ్ల క్రితం వెంకట్రామా టాకీస్ కట్టారు. మొదట నెలకు రూ.240 జీతానికి టికెట్ కౌంటరులో పనిచేశా. గతంలో కొత్త సినిమా విడుదల అవుతుందంటే టాకీస్ యజమానితో పాటు మాకు ఎంతో గౌరవం ఉండేది. మూడేళ్లుగా టాకీస్‌లు సరిగా నడవక, ప్రేక్షకులు సరిగా రాక థియేటర్ల యజమానులు నష్టపోతున్నారు. థియేటర్లకు మళ్లీ పూర్వ వైభవం రావాలని కోరుకుంటున్నా. ప్రస్తుతం నెలకు రూ.8 వేల జీతానికి థియేటర్ కాపలాదారుగా పనిచేస్తున్నా.

రాబడి లేదు..: - గండె నవీన్, హీరో మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్‌బాబు కొత్త సినిమాలు విడుదల అయ్యే రోజు అభిమానులుగా మాకు పండగే. సినిమా విడుదలకు ముందు రోజు థియేటర్లను పెళ్లి మండపంలా ముస్తాబు చేసేవాళ్లం. ఇప్పుడు కొత్త సినిమాలు వస్తున్నా.. గతంలో ఉన్నంత ఆనందం కలగట్లేదు. నాడు ఒక సినిమా విడుదలైతే వంద రోజులు, సంవత్సరం పాటు నడిచేవి. ప్రస్తుతం ఒకేరోజు ఎక్కువ ఆటలు ఆడిస్తున్నారు. అయినా థియేటర్ల యాజమాన్యానికి రాబడి లేదు.

నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రికి పట్టింపేది?

కాటారం, న్యూస్‌టుడే: మంథని నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి శ్రీధర్‌బాబుకు పట్టింపు లేదని భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పూసల రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆయన బుధవారం కాటారంలో మాట్లాడారు. కాటారం-కొయ్యూర్ రహదారి అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇసుక లారీలను నిలిపివేస్తామని ఎన్నికల వేళ ఇచ్చిన హామీని విస్మరించారని, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రైతులకు వెంటనే రైతు భరోసా సాయమందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాజపా నాయకులు భాస్కర్‌రెడ్డి, రంజిత్, శ్రీశైలం, సునీల్, రవి పాల్గొన్నారు.



ప్రగతి చక్రం.. పర్యావరణ హితం

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే

● హనుమకొండకు చేరుకున్న ఎలక్ట్రికల్ బస్సులు



'బస్సుల నిర్వహణ బాధ్యత జేబీఎం సంస్థకు అప్పజెప్పారు. వీటిని నడిపేందుకు ప్రత్యేక నైపుణ్యం కలిగిన డ్రైవర్లు అవసరం ఉండటంతో ఆ సంస్థనే నియమకాలు చేపట్టనుంది. ఆర్టీసీ.. కండక్టర్ల పర్యవేక్షణ బాధ్యతలు చూసుకుంటుంది. ఇవి అద్దె ప్రాతిపదికన నడుస్తాయి.'

మహాలక్ష్మి వర్తిస్తుంది..
ఎలక్ట్రికల్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ మహాలక్ష్మి పథకం, ఇతర అన్ని రకాల రాయితీలు వర్తిస్తాయి. సాధారణ ఛార్జీలే ఉంటాయి..

ప్రజా రవాణా వ్యవస్థ అనగానే ముందుగా అందరికీ గుర్తుకొచ్చేది ఆర్టీసీ. బస్సులు నిత్యం లక్షల కిలోమీటర్లు తిరుగుతూ వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. ఆధునిక వసతులతో మరింత సౌకర్యవంతమైన ప్రయాణ సదుపాయం కల్పిస్తూ ఆర్టీసీ సంస్థ ప్రయాణికుల ఆదరణ పొందు తోంది. ఇప్పటికే రాజధాని, గరుడ లాంటి ఏసీ బస్సులు, లహరి వంటి స్లీపర్ క్లాస్ బస్సులను ప్రవేశపెట్టింది. తాజాగా మరో అడుగు ముందుకేసి ఇంధన భారాన్ని తగ్గించుకోవడంతో పాటు పర్యావరణాన్ని రక్షించాలనే ఉద్దేశంతో ఎలక్ట్రికల్ బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చింది.

మూడు రకాలుగా..

- పర్యావరణ హితంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రికల్ బస్సుల్లో వరంగల్ రీజియన్‌కు 84 కేటాయించారు.
- డీలక్స్, సూపర్‌లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ మూడు రకాలు ఉంటాయి. వీటిని హైదరాబాద్ - వరంగల్, వరంగల్-కరీంనగర్ రూట్‌లో నడపనున్నారు.
- రీజియన్‌కు బుధవారం రాత్రి వరకు నాలుగు డీలక్స్, ఒకటి సూపర్ లగ్జరీ మొత్తం 5 బస్సులు చేరుకున్నాయి.
- సూపర్ లగ్జరీలో డ్రైవర్ సీటుతో కలిపి 42, డీలక్స్ బస్సుల్లో 45, ఎక్స్‌ప్రెస్‌లో 55 సీట్లు ఉంటాయి. వీటికి ఛార్జింగ్ అవసరం ఉన్నందున డిపోలో 12 ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు.

ఎలక్ట్రికల్ బస్సులకు గేర్లు ఉండవు



- చాల్లేటి కిరణ్, ఆర్టీసీ సీనియర్ డ్రైవర్, వరంగల్ 2 డిపో

మాములు ఆర్టీసీ బస్సు లకు గేర్లు ఉంటాయి. ఎలక్ట్రికల్ బస్సులకు ఉండవు. ఎక్కువ స్పీడ్ వెళ్లకుండా లాక్ చేస్తారు. సిట్టింగ్, ఇతర మొత్తం మామూలు బస్సుల లాగే ఉంటాయి. శబ్ద కాలుష్యం ఉండదు. వైబ్రేషన్ ఉండదు. అద్దె ప్రాతిపదికన కాకుండా ఆర్టీసీ సొంతంగా ఈ బసులను నిర్వహిస్తే మరింత ఉపయోగకరంగా ఉండేది. దీంతో పాటు ఆర్టీసీ డ్రైవర్లుగా కొంత మందికి ఉపాధి దొరుకుతుంది.

ఇవీ ప్రత్యేకతలు..



- 1.45 గంటలు ఛార్జింగ్ చేస్తే 350 కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తాయి.
- ప్రయాణికులకు అత్యవసరమైతే బస్సును ఆపేందుకు ప్రతి సీటుపై ఎస్‌ఓఎస్ మీట పెట్టారు.
- బస్సుకు మొత్తం 5 సీసీ కెమెరాలు అమర్చారు. డ్రైవర్ సీటు ముందు భాగంలో కెమెరా మానిటరింగ్ చేసే విధంగా ఏర్పాటు చేశారు.
- ప్రతి సీటు వద్ద చరవాణి ఛార్జింగ్ పాయింట్ ఇచ్చారు.
- డ్రైవర్ మాట్లాడితే ప్రయాణికులకు వినపడేలా మైక్ సిస్టం ఏర్పాటు చేశారు.
- ఈ బస్సులకు ఇంటెలిజెన్స్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం అందుబాటులో ఉంది. దీని ద్వారా బస్సు ఎక్కడ ఉందో జీపీఎస్ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించారు.
- డోర్ తెరిచి ఉంటే బస్సు స్టార్ట్ కాదు. దీనికి గేర్ సిస్టం ఉండదు. కేవలం ఎక్స్‌లేటర్ మాత్రమే ఉంటుంది. గంటకు 80 కిలోమీటర్ల వేగానికి మించి పోకుండా స్పీడ్ లాక్ చేశారు.
- జీపీఎస్‌తో అనుసంధానమై ఉండటంతో ప్రయాణికులు గమ్యం యాప్ ద్వారా ఈ బస్సు ఎక్కడ ఉంది, ఎక్కడికి వరకు వచ్చింది, గమ్యస్థానం చేరుకోవడానికి ఇంకా ఎంత సమయం పడుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.
- అగ్నిప్రమాదం జరిగే అవకాశం ఉంటే ముందుగానే పసిగట్టి అలారం మోగే విధంగా సాంకేతికతను ఉపయోగించారు. అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే సమీపంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందేలా ఏర్పాటు చేశారు.



ఇటీవల కటాక్షపూర్ లో లెవెల్ కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరద..

ఎట్టకేలకు లభించిన కటాక్షం

● వంతెన నిర్మాణానికి మార్గం సుగమం..

ఎన్నో ఏళ్ల కల.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కటాక్షపూర్ వంతెన నిర్మాణం.. ఎట్టకేలకు నెరవేర బోతోంది. ఈ వంతెనతోపాటు మరో చోట మూల మలుపును నేరుగా చేసేందుకు అవసరమైన భూ సేకరణ జరిపేలా బుధవారం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. భూ సేకరణ పూర్తయితే వంతెన పనులను చేపట్టనున్నారు.

పరకాల, న్యూస్‌టుడే

అత్యంత కీలకం..

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్-భూపాలపట్నం 163 జాతీయ రహదారిలో కటాక్షపూర్ వంతెన నిర్మాణం అత్యంత కీలకం. కటాక్షపూర్ చెరువు వద్ద శిథిలావస్థకు చేరిన లో లెవెల్ కాజ్‌వేతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో చెరువు మత్తడి పడి రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరతో పాటు పర్యాటక ప్రదేశాలైన లక్నవరం, రామప్ప, బొగత జలపాతం వంటి ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడం వల్ల అన్ని ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉద్ధృతి ఉంటే పూర్తిగా రాకపోకలు స్తంభించిపోతాయి.

భూసేకరణే ఆలస్యం..

కటాక్షపూర్ లెవెల్ కాజ్‌వే చోట వంతెన నిర్మించడానికి ఏడాదిన్నర కిందట రూ.312 కోట్లను విడుదల చేయగా టెండర్ ప్రక్రియ కూడా ముగిసింది. వంతెనను వెడల్పుగా నిర్మించడానికి హౌజ్‌బుజుర్గు, కటాక్షపూర్ గ్రామాల మధ్య కొంతమేర భూ సేకరణ అవసరం. అదే సమయంలో నీరుకుళ్ల క్రాస్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపును నేరుగా చేయడానికి సైతం అదనపు భూమి కావాలి. ఈ రెండు చోట్ల అవసరమైన భూ సేకరణకు అనుమతి ఇవ్వాలని ఆర్ అండ్‌బీ(జాతీయ రహదారి) అధికారులు నెల రోజుల కిందట కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు బుధవారం భూ సేకరణకు కేంద్ర రహదారి, రవాణా శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ బాధ్యతలను పరకాల ఆర్డీవోకు అప్పగించారు.. భూ సేకరణకు సర్వే చేసి బాధిత రైతులకు పరిహారం ఇచ్చిన వెంటనే వంతెనతోపాటు మూలమలుపును నేరుగా చేసే పనులు ప్రారంభం కానున్నాయి.

జులై వరకు గడువు..

163వ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మధ్యలో నుంచి ఎటూ 50 పీట్లతో కూడిన నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులను హనుమకొండ, ములుగు జిల్లాలో కలిపి మొత్తం 36 కిలోమీటర్లు పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో హనుమకొండ జిల్లాలో 20 కిలోమీటర్లు, ములుగు జిల్లాలో 10 కిలోమీటర్ల వరకు పనులు చేయాలి. వీటికిగాను రూ.208 కోట్లను విడుదల చేయగా 2022లో పనులను చేపట్టారు. వచ్చే ఏడాది జులై వరకు ఈ పనులను పూర్తి చేయడానికి గడువు.

● దీనిపై పరకాల ఆర్డీవో కె.నారాయణ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ భూ సేకరణకు సంబంధించిన నోటిఫికేషన్ వివరాలకు ఇంకా తమకు రాలేదన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన శాతవాహన
వందేభారత్ సహా పలు రైళ్లు ఆలస్యం

డోర్నకల్, న్యూస్‌టుడే: విజయవాడ- సికింద్రాబాద్ మధ్య నడిచే శాతవాహన సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ (12713) బుధవారం మహబూబాబాద్ రైల్వేస్టేషన్ దాటాక కిలోమీటరు దూరంలో సాంకేతిక లోపంతో నిలిచింది. రైలింజన్ మీదుండే ప్యాంటో మొరాయించిందా? లేదా ఓవర్ హెడ్ ఎలక్ట్రిఫికేషన్‌లో సమస్య తలెత్తిందా అన్నది రైల్వే అధికారులే ఒక అంచనాకు రాలేకపోయారు. తర్వాత లోపాన్ని సరిదిద్ది రైలును నడిపారు. శాతవాహనకు ఉదయం 9.02 నుంచి 9.39 గంటల వరకు 37 నిమిషాలపాటు అంతరాయం కలగడంతో ఇతర రైళ్లు ఆలస్యంగా నడిచాయి. గుండ్రాతిమడుగు దాటాక నిలిచిన ఒక గూడ్స్ రైలు మొరాయించడంతో మహబూబాబాద్ నుంచి మరో ఇంజిన్ పంపించి తీసుకొచ్చారు. ఈలోగా గుండ్రాతిమడుగు స్టేషన్‌లో విశాఖపట్నం- ముంబయి ఎల్‌టీటీ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్(18519) రైలు గంట, డోర్నకల్‌లో గుంటూరు- సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్(17201) గంట 10 నిమిషాలు, విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్(20833) ఎక్స్‌ప్రెస్ పాపటపల్లి రైల్వేస్టేషన్‌లో గంటకు పైగా నిలిచాయి.

పట్టణాభివృద్ధికి శ్రీకారం!

● ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదనలు

పట్టణీకరణ శరవేగంగా పెరుగుతోన్న నేపథ్యంలో ప్రణాళిక బద్ధమైన విస్తరణ, అభివృద్ధి, నాణ్యమైన పట్టణవాసం కల్పించడమే లక్ష్యంగా జిల్లాకో పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ- యూడీఏ)లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. గతంలో ఉన్న పట్టణాభివృద్ధి సంస్థలను అవసరమైన చోట విస్తరించాలని, ఇందుకు అవకాశాలు లేని చోట కొత్తవి ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా 18 సంస్థలను ఏర్పాటు చేయనుంది. – జనగామ, న్యూస్‌టుడే


'ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే వరంగల్, హనుమకొండ జిల్లాలు 'కుడా' పరిధిలో ఉన్నాయి.'

'ఏజెన్సీ ప్రాంతం అత్యధికంగా ఉన్న జిల్లాలను ఈ ప్రక్రియ నుంచి మినహాయించారు. దీంతో ములుగు జిల్లాకు ఈ అవకాశం లేదు. మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి..'

యూడీఏ	వైశాల్యం (చ.కి.మీ),	జనాభా–2011	జనాభా(2024) అంచనా	పురపాలికలు /గ్రామాలు
జనగామ(జుడా)	1654.756	403516	454168	1/225
భూపాలపల్లి(బుడా)	2293	416763	462249	1/242
మహబూబాబాద్(ముడా)	1891.75	600101	654961	4/163

ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో..


జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కన్వీనర్‌గా, జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో), జిల్లా గ్రామీణ, పట్టణ ప్రణాళిక అధికారి(డీటీసీపీవో), ఆర్డీవోలు, పురపాలక కమిషనర్లు, సర్వే లాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు. వీరు జిల్లా కేంద్రంతో పాటు పట్టణీకరణ ప్రభావం, విస్తరణకు అవకాశాలున్న గ్రామాలు, 2011 జనాభా, ప్రస్తుత అంచనా జనాభా, ఏరియా తదితర వివరాలతో నక్షా(ప్లాన్) తదితర వివరాలతో ప్రతిపాదనను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ద్వారా ప్రభుత్వానికి పంపించారు.



జనగామ పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (జుడా)

'జనగామ మున్సిపల్ సహా 226 గ్రామాలను జుడా పరిధిలో చేర్చాలని ప్రతిపాదించారు.'

2017లో 10 మండలాలతో జనగామ పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ప్రస్తుతం జిల్లా పరిధిలో 12 మండలాలుండగా, జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాలు 'కుడా' పరిధిలో ఉన్నాయి. వాటిలో మార్పు లేదు. 283 గ్రామాలకు గాను.. ఈ జిల్లా సూర్యాపేట, భువనగిరి యాదాద్రి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలతో సరిహద్దు కలిగి ఉంది.



● విద్య, వైద్యం, వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందుతున్న క్రమంలో రైలు, రోడ్డు, భూముల క్రయవిక్రయాలకు అనువుగా ఉన్న కారణంతో జుడా పరిధిలోకి తేవాలని ప్రతిపాదించారు.

భూపాలపల్లి (బుడా)

కరీంనగర్, వరంగల్ జిల్లాల పరిధిలోని ప్రాంతాలను పునర్వ్యవస్థీకరించి భూపాలపల్లి జిల్లాను ఏర్పాటు చేశారు. ఆరు జిల్లాలు, రెండు రాష్ట్రాలతో సరిహద్దు బంధం కలిగి ఉంది. ప్రాణహిత, గోదావరి పరివాహక ప్రాంతాలు, సింగరేణి, కేటీపీపీ వంటి పరిశ్రమలు, కాళేశ్వరం ప్రాజెక్టు కేంద్రంగా ఉంది.

● ఎన్‌హెచ్ 353సి, ఎన్‌హెచ్ 163జితో అనుసంధానమై వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధికి అవకాశం ఉన్నందున పట్టణీకరణకు విస్తార అవకాశాలున్నందున జిల్లా పట్టణాభివృద్ధి సంస్థ అవసరమని ప్రతిపాదించారు.

'భూపాలపల్లి పురపాలిక సహా 242 గ్రామాలతో 'బుడా' ఏర్పాటుకు ప్రతిపాదించారు.'



మహబూబాబాద్ (ముడా)

ఎన్‌హెచ్ 365 పరిధిలోని మహబూబాబాద్ ఏడు జిల్లాలతో సరిహద్దు కలిగి ఉంది. ఎన్‌హెచ్ 563, ఎన్‌హెచ్ 930పి, ఎన్‌హెచ్ 163జిలతో అనుబంధాన్ని కలిగి ఉంది. సికింద్రాబాద్-విజయవాడ మధ్య రైలు సౌకర్యంతో ఉన్న జిల్లాలో భవిష్యత్తులో వ్యాపార, వాణిజ్య ఇతర రంగాల అభివృద్ధికి అన్ని అవకాశాలున్నందున ముడా ఏర్పాటుకు ప్రతిపాదించారు.

'మహబూబాబాద్, డోర్నకల్, తొర్రూరు, మరిపెడ(4) పురపాలికలు, 163 రెవెన్యూ గ్రామాలతో ముడాను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.'



కొనుగోలుదారుల ఆదరణ పొందాలి



రిబ్బన్ కత్తిరించి షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, మాధవరెడ్డి

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : నాణ్యమైన వస్త్రాలతో కొనుగోలుదారుల ఆదరణ పొందాలని వరంగల్ పశ్చిమ, నర్సంపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి అన్నారు. హనుమకొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూంను బుధవారం వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఏ వ్యాపారానికైనా కొనుగోలుదారుల నమ్మకమే ముఖ్యమన్నారు. ప్రముఖ వస్త్ర వ్యాపారి కాసం నమఃశివాయ మొదటి కొనుగోలుదారుగా దుస్తులు కొన్నారు. షోరూం జీఎం సశింద్రన్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఇదే పెద్ద షోరూం అన్నారు. దక్షిణ భారతంలో రామ్‌రాజ్ షోరూంలు అత్యంత ప్రజాదరణ పొందాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముప్పిడి విజయ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్-23 క్రికెట్ విజేత హనుమకొండ జట్టు



జట్టు సభ్యులతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-23 క్రికెట్ పోటీల్లో హనుమకొండ జట్టు విజేతగా నిలిచింది. హనుమకొండలోని రెడ్డిపురంలో ఉన్న టీవీవీ సుఖాంత్ క్రీడా మైదానంలో ఈ నెల 20 నుంచి 23 వరకు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హనుమకొండ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. ఛేదనకు దిగిన మహబూబాబాద్ జట్టు 16 ఓవర్లలో 64 పరుగులకే కుప్పకూలింది. విజేత హనుమకొండ, రన్నరప్‌గా నిలిచిన మహబూబాబాద్ జట్లకు అతిథులు ట్రోఫీలు అందించారు. కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు ఉపేందర్, రాము, మట్టెడ కుమార్, మాజీ కార్యదర్శి ఉదయభానురావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు



విజేతలతో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, అతిథులు

వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలు బుధవారం ముగిశాయి. హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకల మందిరంలో నిర్వహించిన అండర్-15 విభాగం పోటీల ముగింపు వేడుకలకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చదరంగం పోటీలకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌ను ఉచితంగా వినియోగించుకోవచ్చన్నారు. విజేతలు నవంబరు 3 నుంచి 11 వరకు తమిళనాడులో జరిగే జాతీయస్థాయి చదరంగం పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. చీఫ్ ఆర్బిటర్ సాయిప్రసాద్, ఆర్బిటర్లు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి పాల్గొన్నారు.

విజేతలు: బాలుర విభాగంలో యోహాన్ యాదవ్, ప్రణయ్, అంజనికుమార్, సాహర్ష, బాలికల విభాగంలో యాశ్విజైన్, శరణ్య, సహర్ష, శ్రీలాస్య తొలి నాలుగు స్థానాల్లో నిలిచారు.

మూసీ పునరుద్ధరణలో నిర్వాసితులకు న్యాయం చేయాలి



రహదారి పనులు పరిశీలిస్తున్న సీపీఐ కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు, నాయకులు

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో మూసీ నది పునరుద్ధరణ, హైడ్రాలో ఇళ్లు కోల్పోయిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో పార్టీ సమావేశానికి హాజరై ఖమ్మం వెళ్తూ.. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిలో పార్టీ నాయకులతో కలిసి ఎల్కతుర్తి - సిద్దిపేట జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ రహదారి పనులు నాసిరకంగా సాగుతున్నాయని, దీనిపై విజిలెన్స్ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఆచార్య సాయిబాబు మృతి కేంద్ర ప్రభుత్వ హత్యగా అభివర్ణించారు. ఇటీవల హరియాణాలో జరిగిన ఎన్నికల్లో భాజపాది నిజమైన విజయం కాదని, కాంగ్రెస్ వైఫల్యంతో అధిక సీట్లు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గడువులోపు హామీలను అమలు చేయకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

కోచ్ ఫ్యాక్టరీపై స్పష్టత అవసరం



కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కాజీపేట, న్యూస్‌టుడే: కాజీపేటలో నిర్మిస్తామంటున్న కోచ్ ఫ్యాక్టరీపై కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన రావాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. బుధవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి కాజీపేట రైల్వే జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, అయోధ్యపురంలో వ్యాగన్ తయారీ కేంద్రం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంపై గురువారం దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జీఎంతో జరిగే సమావేశంలో ప్రస్తావిస్తానని, తర్వాత రైల్వే శాఖ మంత్రిని కలుస్తానని చెప్పారు. జిల్లా వాసుల చిరకాల స్వప్నం కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ సాధనకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కాజీపేట - బల్లార్షా మార్గంలో నాలుగు లైన్ల నిర్మాణం పూర్తికావడంతో కాజీపేట మీదుగా మరిన్ని రైళ్లు తిరిగే అవకాశం ఉందని, దీనికి అనుగుణంగా ప్లాటుఫారాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కాజీపేట స్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, విశ్రాంత గదుల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాజీపేటలో బస్టాండ్ లేక పోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, రైల్వే స్థలం ఇస్తే బస్టాండ్ నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం రైల్వే ఆసుపత్రిని సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ సీఈ లక్ష్మీనారాయణ, సీనియర్ డీఈఎన్ వెంకట్, సీడీఎం అనికేత్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎస్సార్

గణపురం, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆయన బుధవారం గణపురంలోని ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నారని, ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. పాఠశాల మరమ్మతులకు గతంలో రూ.15 లక్షలు ఇవ్వగా, క్రీడామైదానంలో వసతులకు రూ.5 లక్షలు మంజూరు చేశారన్నారు. మరో రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నామని, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. పాఠశాల, వసతిగృహంలో అందిస్తున్న భోజనం, సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆదర్శపాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



విజేతలతో పాఠశాల ప్రధానోపాధ్యాయిని లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు

ప్రతిభ చాటి.. బహుమతులు గెలిచి..

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లిలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎస్.మనుశ్రీ, ఎ.అభిరాం, పి.రక్షితకుమార్‌లకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని లక్ష్మీప్రసన్న బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రమౌళి, జి.శ్రీనివాస్, పి.రమేష్, ఎం.శ్రీవాణి, కె.సారంగరెడ్డి, కె.కవిత తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097, భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

పైపులైన్‌కు మరమ్మతులు



రేగొండ, న్యూస్‌టుడే: రేగొండ ఎస్సీ కాలనీ సమీపంలో పగిలిపోయిన పైపులైన్‌కు బుధవారం పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేశారు. 'పగిలిన పైపులైన్' శీర్షికతో బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి తుల్జారాణి స్పందించారు. పంచాయతీ సిబ్బందితో కొత్త పైపును బిగించారు.

గురుకుల విద్యార్థినులు క్రీడల్లో సత్తా చాటాలి

కమలాపూర్, న్యూస్‌టుడే: మహాత్మా జ్యోతిబా పులే బీసీ సంక్షేమ గురుకుల విద్యార్థినులు క్రీడా పోటీల్లో సత్తా చాటాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం కమలాపూర్‌లోని బాలికల గురుకుల పాఠశాల మైదానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి (అండర్-17) క్రీడా పోటీలను ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ముందుగా ఉమ్మడి జిల్లాలోని 18 గురుకుల పాఠశాలల నుంచి వచ్చిన 630 మంది క్రీడాకారులు కవాతు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన నిఖత్ జరీన్, జీవంజీ దీప్తిలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బాలికలు యోగాసనాలు వేసి ఆకట్టుకున్నారు. బీసీ సంక్షేమ శాఖ డీడీ రాంరెడ్డి, డీసీవో వెంకటప్రసాద్, కమలాపూర్ బాలికల పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య, బాలుర పాఠశాల ప్రిన్సిపల్ టి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, చిత్రంలో బీసీ సంక్షేమశాఖ డీడీ రాంరెడ్డి, డీసీవో వెంకటప్రసాద్, క్రీడాకారులు

సార్వత్రిక విద్య ఎంతో సులభం



గోడపత్రికలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: చదువు మధ్యలో మానేసిన వారికి సార్వత్రికవిద్య ఎంతో సులభమని ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో బుధవారం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశాలకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. మహిళలు, వివిధ వృత్తి పనులపై ఆధారపడిన వారు సెలవు దినాల్లో ఈ కోర్సులను పూర్తి చేసుకోవచ్చని శంకర్‌రావు సూచించారు. ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రవేశాల కోసం సమీపంలోని అధ్యయన కేంద్రాల కో ఆర్డినేటర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అశోక్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ శ్యామల వీరన్న, ఉపాధ్యాయులు రమణారెడ్డి, దుప్పటి మొగిలి తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

కాటారం, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ బుధవారం తెలిపారు. మండలకేంద్రానికి చెందిన రామిళ్ల కిరణ్, ఉప్పు సంతోష్, దుర్గారావు, రాజవర్ధన్‌లు ఆదివారం రాత్రి స్థానిక పీహెచ్‌సీకి వెళ్లి డ్యూటీ డాక్టర్ మౌనిక, సిబ్బంది మందు ఇచ్చినా వెళ్లకుండా వాగ్వాదానికి దిగినట్లు పేర్కొన్నారు. మద్యం మత్తులో వైద్యురాలు మౌనిక, సిబ్బందితో అసభ్యంగా మాట్లాడుతూ విధులకు ఆటంకం కలిగించారన్నారు. వైద్యురాలు మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యురాలిపై ఫిర్యాదు

కాటారం, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మౌనికపై జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేసినట్లు భారాస మండల ఇన్‌ఛార్జి జోడు శ్రీనివాస్ తెలిపారు. వైద్యురాలు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సక్రమంగా హాజరు కావడం లేదని ఆరోపించారు. రోగులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు.

దీపావళికి కాజీపేట మీదుగా ప్రత్యేక రైళ్లు

కాజీపేట, న్యూస్‌టుడే: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కాజీపేట మీదుగా ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాలకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. 07003 నంబరుతో సికింద్రాబాద్-పాట్నా మధ్య ఈ నెల 26, వచ్చే నెల 2, 9వ తేదీల్లో ఉంటుంది. సికింద్రాబాద్‌లో ఉదయం 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 7 గంటలకు పాట్నా చేరుతుంది. 07004 నంబరుతో తిరుగు ప్రయాణంలో పాట్నాలో ఈ నెల 28న, వచ్చే నెల 4, 11వ తేదీల్లో అందుబాటులో ఉంటుంది. మౌలాలి-ముజఫర్‌పూర్ మధ్య 07649 నంబరుతో ఈ నెల 28, వచ్చే నెల 4, 11 వతేదీలలో ఉంటుంది. మౌలాలిలో సోమవారం సాయంత్రం 4.45 గంటలకు బయలుదేరి, బుధవారం ఉదయం 2.30 గంటలకు ముజఫర్‌పూర్ చేరుతుంది. 07650 నంబరుతో తిరుగు ప్రయాణం ఈ నెల 30, వచ్చే నెల 6, 13వ తేదీలలో అందుబాటులో ఉంటుంది. ముజాఫర్‌పూర్‌లో బుధవారం ఉదయం 4.50 గంటలకు బయలుదేరి గురువారం సాయంత్రం 7 గంటలకు లింగంపల్లి (తిరుగు ప్రయాణం లింగంపల్లి వరకు) చేరుతుంది. సనత్‌నగర్ నుంచి శంత్రాగాచీకి 07069 నంబరుతో ఈ నెల 30న, వచ్చే నెల 6వ తేదీలలో ఉంటుంది. సనత్‌నగర్‌లో బుధవారం ఉదయం 6.20 గంటలకు బయలుదేరి, గురువారం మధ్యాహ్నం 12.20 గంటలకు శంత్రాగాచి చేరుతుంది. తిరుగు ప్రయాణం 07070 నంబరుతో ఈ నెల 31, వచ్చే నెల 7వ తేదీలలో అందుబాటులో ఉంటుంది. శంత్రాగాచీలో సాయంత్రం గురువారం 5.25 గంటలకు బయలుదేరి, శుక్రవారం రాత్రి 11.50 గంటలకు సనత్‌నగర్ చేరుతుంది.

- పాట్నా ప్రత్యేక రైలు జనగామ, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల సిర్పూర్‌కాగజ్‌నగర్‌లలో ఆగుతుంది. ముజాఫర్‌పూర్ ప్రత్యేక రైలు చర్లపల్లి, జనగామ, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, సిర్పూర్‌కాగజ్‌నగర్‌లలో ఆగుతుంది.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం..



కరుణాపురంలోని గురుకుల పాఠశాలలో క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఆర్‌సీవో రాజ్‌కుమార్

ధర్మసాగర్: క్రీడలు విద్యార్థుల్లో మానసిక వికాసానికి దోహదం చేస్తాయని మహాత్మా జ్యోతిబా పులే తెలంగాణ బీసీ గురుకులాల ఆర్‌సీవో రాజ్‌కుమార్ అన్నారు. ధర్మసాగర్ మండలం కరుణాపురంలో నిర్వహిస్తున్న స్టేషన్‌ఘన్‌పూర్ బాలుర బీసీ గురుకులంలో ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి క్రీడోత్సవాలను ఆయన బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు సేవా గుణం, మానవీయతను పెంపొందించుకోవాలన్నారు. 18 పాఠశాలల నుంచి విద్యార్థులు క్రీడా పోటీలకు హాజరయ్యారు. జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ రవికుమార్ పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏర్పాటు చేయాలని వినతి



మహదేవపూర్‌లో ఏపీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మహదేవపూర్, న్యూస్‌టుడే: గిరిజనులు, ఆదివాసీల సమస్యల పరిష్కారానికి మహదేవపూర్‌లో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఆదివాసీ నాయకులు కోరారు. ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మహదేవపూర్‌లో కొమురం భీం వర్ధంతి నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉన్న మాడా వ్యవస్థను పునరుద్ధరించాలని, మారుమూల గ్రామాల్లో ఇంటర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. పలిమెలలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. గిరిజన వసతి, ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. మండల కేంద్రంలోని కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏటూర్‌నాగారం ఐటీడీఏ ఏపీవో భీంరావ్ సమావేశానికి హాజరు కాగా.. పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏటీడీవో క్షేత్రయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఆదివాసీ సంఘాల నాయకులు మడె కుమార్, గుర్సింగ బాపు, రవి, భూమయ్య, ఎర్రయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం

భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జంగేడులోని ఓ ఇంటిలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికురాలికి సంబంధించిన సామగ్రి దగ్ధమయ్యాయి. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఉదయం మంటలు రావడంతో స్థానికులు మున్సిపాలిటీకి సమాచారమిచ్చారు. మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష నష్టం జరిగిందని పురపాలక సంఘం కమిషనర్ రాజేశ్వర్ తెలిపారు.

సృజనకు మెరుగులు దిద్దేందుకే చెకుముకి పరీక్ష



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎస్సై పవన్‌కుమార్, ఉపాధ్యాయులు

మహదేవపూర్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించేందుకే చెకుముకి ప్రతిభ పరీక్షను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నవంబర్ 7 నుంచి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బుధవారం గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సై పవన్‌కుమార్, ప్రభుత్వ పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మడక మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి స్వల్పంగా పెరిగిన వరద

మహదేవపూర్, న్యూస్‌టుడే : కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీకి వరద ప్రవాహం స్వల్పంగా పెరిగింది. బ్యారేజీకి 82,330 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదతో 1,23,290 క్యూసెక్కులకు పెరిగింది. దిగువకు వరదనీటిని వదులుతున్నారు.

మహిళా చట్టాలపై విద్యార్థులకు అవగాహన

చిట్యాల, న్యూస్‌టుడే: చిట్యాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై ఫజల్‌ఖాన్ మాట్లాడుతూ.. విద్యార్థులు తోటి విద్యార్థినులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ చదువులో రాణించాలన్నారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీదేవి, అధ్యాపకులు కర్ణాజీ, పోలీసులు పాల్గొన్నారు.

పేలుళ్లపై కాలనీవాసుల నిరసన



గణపురం, న్యూస్‌టుడే: సింగరేణి ఓసీ3 పేలుళ్లతో తమ ఇళ్లు ధ్వంసమవుతున్నాయని, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గుర్రంపేట ఎస్సీ కాలనీ ప్రజలు ఓసీ3 ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కాలనీకి అతి సమీపంలో ఓసీ3 ఉండటంతో నిత్యం పేలుళ్లతో ఇంటి గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయన్నారు. దుమ్ముతో అనారోగ్యం బారిన పడుతున్నామన్నారు. కలెక్టర్ సమస్యను పరిశీలించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా తమకు పునరావాసం కల్పించకపోతే ఓసీ3 పనులను అడ్డుకుంటామన్నారు.

చేప పిల్లల పంపిణీ



కాటారం, న్యూస్‌టుడే: జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం కాటారంలో 11 పంచాయతీలకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేశారు. సుమారు 7 లక్షల చేప పిల్లలను వంద శాతం రాయితీపై అందజేసినట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్, అధికారులు రమేష్, కవిత, వేణు, ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాకతీయుల సాంకేతిక పరిజ్ఞానానికి సాటి మరొకటి లేదు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: కాకతీయుల సాంకేతిక పరిజ్ఞానానికి సాటి ప్రపంచంలోనే మరొకటి లేదని ఎన్ఐటీ ప్రొఫెసర్ రమణమూర్తి అన్నారు. రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం కొనసాగుతోంది. బుధవారం ఉదయం యోగాసనాలతో మొదలైన ఈ శిబిరంలో ఉదయం వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ రమణమూర్తి, కాకతీయ కట్టడాల నిర్మాణాలు, వాడిన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. ప్రముఖ ఆర్కిటెక్, హిస్టోరియన్ వేదకుమార్ కాకతీయుల చరిత్ర, వాటి విశిష్టత, తెలంగాణలోని ప్రముఖ దేవాలయాల చరిత్ర, రాజవంశీయుల పాలనపై వివరించారు. మధ్యాహ్నం హైదరాబాద్ సెంట్రల్ యునివర్సిటీ ప్రొఫెసర్ కేపీ రావు మానవ పరిణామక్రమం ఏ విధంగా మొదలైందో వివరించారు. శిబిరం నిర్వహణలో ప్రత్యేక చొరవ తీసుకుని నిరంతరం పనిచేస్తున్న కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ప్రొఫెసర్ పాండురంగారావును వారు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ అధికారి కుసుమ సూర్యకిరణ్, టూరిజం, పురావస్తుశాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైద్య విద్యార్థినికి సన్మానం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి రెండో వార్డులోని ఆకుదారివాడకు చెందిన తాపీమేస్త్రి సారయ్య కుమార్తె పూజిత ఎంబీబీఎస్ సీటు సాధించడంతో బుధవారం భాజపా అర్బన్ కమిటీ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి, నాయకులు పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువాలతో సన్మానించారు. పూజిత నీట్‌లో 550వ ర్యాంకు సాధించడం అభినందనీయమని మధుసూదన్‌రెడ్డి అన్నారు. భాజపా నాయకులు తమ్మేటి రాంరెడ్డి, కోరే సుధాకర్, రాజయ్య, ఏనుగుల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

బాధిత కుటుంబాలకు పరామర్శ

మొగుళ్లపల్లి: వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం పరామర్శించారు. రంగాపూర్‌కు చెందిన లోకులబోయిన మహేందర్, బాల్త చేరాలు, కీర్తి రాజయ్యలు మృతిచెందగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఆకుతోట కుమారస్వామి, పోలినేని లింగారావు తదితరులు ఉన్నారు.

కాటారం: కాటారంలో ఇటీవల మృతి చెందిన మాదారపు రమేష్, సింగనవేన సుందర్‌ల కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. కార్యక్రమంలో భారాస నాయకులు జోడు శ్రీనివాస్, కిరణ్, వెంకటేశ్వర్ రావు, సడవలి, శ్రావణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

ప్రభాస్ జన్మదిన వేడుకలు



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న అభిమానులు

చిట్యాల, న్యూస్‌టుడే: సినీ నటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలను బుధవారం చిట్యాలలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడలిలో కేకు కోసి మిఠాయిలు పంచారు. బాణసంచా కాల్చారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు గుడ్లు, పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉయ్యాల రమేశ్, మేడిపెల్లి శ్రీనివాస్, నేపాలి రాకేశ్, ప్రభు, రాజేశ్, లవన్‌బాబు, రమేశ్, నాగరాజు, రాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

చరవాణి అప్పగింత

చిట్యాల, న్యూస్‌టుడే: చరవాణిని పోగొట్టుకున్న బాధితుడికి పోలీసులు చరవాణిని అప్పగించారు. చిట్యాల ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చింతకుంటరామయ్యపల్లికి చెందిన పర్లపెల్లి కుమార్ తన చరవాణిని పోగొట్టుకున్నాడు. దీనిపై స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దర్యాప్తు చేసిన పోలీసులు చరవాణిని గుర్తించి బుధవారం బాధితుడికి అప్పగించారు. సిబ్బందిని ఎస్సై అభినందించారు. శిక్షణ ఎస్సైలు మహేశ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కళాకారుల సంఘం జిల్లా కన్వీనర్‌గా స్వరూప



భూపాలపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమ కళాకారుల ఫోరం మహిళా విభాగం జిల్లా కన్వీనర్‌గా భూపాలపల్లికి చెందిన గడ్డం స్వరూపను నియమించినట్లు బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కళాకారుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తానని స్వరూప తెలిపారు.

పేదల అభ్యున్నతే భాజపా లక్ష్యం

ములుగు రూరల్, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే భాజపా లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం అన్నారు. బుధవారం ములుగు మండలం జంగాలపల్లిలోని వారాంతపు సంతలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు.

భాజపా బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి

రేగొండ, న్యూస్‌టుడే: మండలంలో భాజపా బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పార్టీ మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో నిశిధర్‌రెడ్డి మాట్లాడారు. బూత్ స్థాయిలో కనీసం 100 మంది కార్యకర్తలు పార్టీ సభ్యత్వం తీసుకునేలా నేతలు పాటుపడాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాపయ్య, నేతలు మొగిలి, ప్రసాద్‌రావు, గాలిఫ్, రాజేందర్, కుమార్, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు వారాల్లో నియామక ప్రక్రియను పూర్తిచేయండి: సీఎండీ

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణిలో ఉద్యోగాల నియామక ప్రక్రియను రెండు వారాల్లో పూర్తిచేయాలని సీఎండీ ఎన్.బలరాం ఏరియాల అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి ఆయన సమీక్ష సమావేశాన్ని దృశ్యమాధ్యమం ద్వారా బుధవారం నిర్వహించారు. 'ఇటీవల ఫలితాలు వెల్లడైన రాత పరీక్షకు సంబంధించి 599 పోస్టులకు గురువారం ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కానుంది. మరో 300 మందికి కారుణ్య నియామకాల పత్రాలను త్వరగా అందించాలని సీఎండీ ఆదేశించినట్లు' కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేమురాజు వెల్లడించారు.

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు శిక్షణ

బొగ్గు బాయి ముచ్చట్లు

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణిలోని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులకు హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రారంభించిన శిక్షణ తరగతులను ఈనెల 26 వరకు నిర్వహించనున్నారు. గుర్తింపు సంఘం నాయకులు కె.రాజ్‌కుమార్, ఎల్.ప్రకాశ్, వై.వి.రావు, ఎం.ఎల్లయ్యగౌడ్, వీరభద్రం, వెంకట్, పోశం, రవీందర్, రాంచంద్రారెడ్డి, భాజీ సైదా, కె.మల్లికార్జున్‌లు హాజరయ్యారు. ప్రాతినిధ్య సంఘం నుంచి బి.జనక్‌ప్రసాద్, త్యాగరాజన్, సమ్మయ్య, రవీందర్‌రెడ్డి, వికాస్‌కుమార్‌లు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత ఆర్జీ-I, 2 జట్టు

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి స్థాయి కబడ్డీ పోటీల్లో రామగుండం-1, 2 జట్టు విజయం సాధించింది. గోదావరిఖని సింగరేణి క్రీడామైదానంలో బుధవారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీల్లో ఆర్జీ-3 భూపాలపల్లి జట్టుపై ఆర్జీ-1, 2 జట్టు గెలుపొంది విజేతగా నిలిచింది. హోరాహోరీగా జరిగిన పోటీల్లో ఆర్జీ-1, 2 జట్టు 51 పాయింట్లు సాధించగా ఆర్జీ-3 భూపాలపల్లి జట్టు 39 పాయింట్లు మాత్రమే సాధించింది. విజేతగా నిలిచిన జట్టుకు జీఎం లలిత్‌కుమార్, ఖని ఏసీపీ రమేష్‌లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు అనిత, అధికారులు రాంమోహన్, కిరణ్‌బాబు, సారంగపాణి, గుర్తింపు సంఘం నాయకులు కె.స్వామి, అధికారుల సంఘం ప్రతినిధి క్రాంతిలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా రాజశేఖర్

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా తాడ్వాయికి చెందిన రేగ రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాడ్వాయి మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల రవి సమక్షంలో బుధవారం జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా కొర్నిబెల్లి సతీష్‌కుమార్, కార్యదర్శిగా బానోత్ సునీత, సంయుక్త కార్యదర్శిగా ఈసం శారద, కోశాధికారిగా కూరాకుల ప్రశాంత్, కార్యనిర్వాహక కార్యదర్శిగా అజ్మీర ధర్మేందర్, సభ్యులుగా రమేష్, జ్ఞానేశ్వరి, భాగ్యరాణి, నర్మద, రజిత, భార్గవ్ చందులాల్ తదితరులు ఎన్నికయ్యారు.

వనదేవతల ఆదాయం రూ.26.81 లక్షలు

మేడారం (తాడ్వాయి), న్యూస్‌టుడే: సమ్మక్క, సారలమ్మ వనదేవతలకు భారీగా కానుకలు లభించాయి. గత నాలుగు నెలలుగా భక్తులు సమర్పించిన 20 హుండీల్లోని కానుకలను మేడారంలోని భోజనశాలలో బుధవారం లెక్కించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేంద్రం తెలిపారు. సమ్మక్క దేవతకు రూ.13,85,398 సారలమ్మ దేవతకు రూ.12,09,392 పగిడిద్దరాజుకు రూ.47,331, గోవిందరాజుకు రూ.39,519 భక్తులు కానుకలు సమర్పించారు. మొత్తం రూ.26.81 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో పేర్కొన్నారు.

వీర్ గాథ 4.0కు స్పందన కరవు

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: బడిఈడు పిల్లలకు దేశభక్తి నూరిపోయడం సహా దేశం కోసం ప్రాణాలర్పించిన వారి వీరగాథలు వినిపించేందుకు కేంద్రం రూపొందించిన వీర్‌గాథ 4.0 వీక్షణానికి ప్రతిస్పందనలు తెలియచేయడంలో ప్రభుత్వ పాఠశాలలు నిరాసక్తత కనిపిస్తున్నాయి. ప్రతి స్పందనల గడువు ఈనెలాఖరు వరకు కేంద్రం పెంచింది.

కార్యక్రమ ముఖ్య ఉద్దేశం..

మన దేశ రక్షణలో విరోచితంగా విధులు నిర్వహించిన యోధులను భారత ప్రభుత్వం గ్యాలంటరీ అవార్డుతో సత్కరిస్తుంది. వారి విజయగాథలను రూపొందించి నాలుగేళ్లుగా అంతర్జాలంలో పొందుపరిచి పాఠశాల విద్యార్థులకు ప్రదర్శనగా అందుబాటులోకి తెచ్చింది. ఈ కార్యక్రమాన్ని దృశ్యరూపంలో విద్యార్థులకు చూపిస్తే సానుకూలంగా స్పందిస్తారని కేంద్రం సూచించింది. చూసిన దానిపై తర్వాత వ్యాసం లేదా కథనం లేదా బొమ్మలు గీయడం లాంటి స్పందనలు సేకరించి తమకు పంపిస్తే మెరుగైన స్పందనలు ఎంపిక చేసి ఆ విద్యార్థులకు బహుమతిగా విమానంలో భారత రక్షణమంత్రితో సంభాషించే ఏర్పాటు చేస్తామని కేంద్రం వివరించింది. కేంద్ర ప్రభుత్వ కేంద్రీయ నవోదయ పాఠశాలలు మినహా ప్రభుత్వ పాఠశాలలు స్పందించడం లేదని సమాచారం. రెండు రోజుల క్రితం జిల్లా విద్యాశాఖాధికారులు మరోసారి గడువు పెంచుతూ ప్రతి పాఠశాల నుంచి స్పందనలు ఉండాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో అమలులో నిర్లక్ష్యం..

కార్యక్రమ ప్రసారానికి ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని హంగులున్నా, పని ఒత్తిడి సహా పలు కారణాలతో ఉపాధ్యాయులు ఒకసారి మాత్రమే ప్రదర్శన నిర్వహించారు. వీర్ గాథ 3.0లో ప్రతిభ చూపిన విద్యార్థుల అభిప్రాయాల మేరకు అవగాహన కల్పిస్తే ఆసక్తి చూపేవారు. మంచి కార్యక్రమానికి నిర్లక్ష్యం వెంటాడుతోంది.

ఈ కార్యక్రమంలో మెరిసిన విద్యార్థులకు బహుమతిగా రూ.10వేల నగదుతో పాటు జాతీయ స్థాయిలో దేశ రాజధానికి విమానంలో రప్పించి వచ్చే గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పిస్తారు. వీర్ గాథ 3.0 వెర్షన్ విజేత హైదరాబాద్‌కు చెందిన వైష్ణవ్ ఎంపిక కావడంతో వచ్చిన గౌరవం, పరేడ్ చూడటం తన జీవితంలో అత్యంత మధురమైన ఘట్టంగా తన సంతోషాన్ని అంతర్జాల పుటలో ప్రస్తావించారు.